సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



బీజేపీని ఓడిద్దాం
కార్పొరేట్‌కు కొమ్ముకాసే బీజేపీని ఓడిద్దామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.
వివరాలు 8లో ▸



ప్రజాగొంతుకనవుతా..
తనను గెలిపిస్తే సమస్యలపై గళమెత్తుతానని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.8 /23.2

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం సమయంలో ఉక్కపోత ఉంటుంది. తీవ్రమైన వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు పరిష్కరించాలి : ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసులు సామాన్య ప్రజలకు ఎప్పుడూ అండగా నిలబడాలని, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడుతూ బాధితులు ఇచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 166 మంది హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సోమవారం హెటిరో ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. మేళాకు మొత్తం 166 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్, సంస్థ ప్రతినిధులు దామోదరచారి, హరీశ్వరచారీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు అన్నారు. సోమవారం పలు అంశాలపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికైతే తాగునీళ్ల కోసం ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వేసవి కావడంతో అధికంగా ఉపాధి పనులు కొనసాగుతుంటాయని, ఇందుకు లేబర్ డిమాండ్ చాలా ఉంటుందని, దానికి అనుగుణంగా అడిగి ప్రతి ఒక్కరికి కూలి కల్పించాలని సూచించారు. కూలీ పనులు జరిగే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని చలువ పందిళ్లలో పని చేయాలని చెప్పారు. సమావేశంలో డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ నర్సింహులు, డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

మేడే విశిష్టతను విచ్ఛిన్నం చేసే కుట్ర



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అన్ని ప్రాంతాల్లో ఎర్రజెండా ఎగురవేసి కార్మిక వర్గానికి మేడే విశిష్టతను ఎలుగెత్తి చాటాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం వాటర్ ఫిట్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో మేడే కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు మేడే విశిష్టతను విచ్ఛిన్నం ప్రయత్నం చేస్తున్నాయన్నారు. వీరుల త్యాగాన్ని, పోరాటాన్ని తగ్గించి మేడేను అస్థిరపరిచే కుట్రలో భాగంగా మేడే సెలవు దినాన్ని కూడా రద్దు చేసిందని, మోదీ హయాంలో కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చారని ఆరోపించారు. ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముక్తార్‌ఖాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వరదగాలన్న, టైల్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి చంటి, పెయింటర్స్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి సూరి, జాఫర్ మాట్లాడుతూ కార్మిక సంఘం సంక్షేమ నిధిని కూడా వాడుకున్న చరిత్ర మోదీ ప్రభుత్వానికే దక్కిందని, క్రమంగా వెల్ఫేర్ బోర్డు ఎత్తివేయాలని ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నజీర్, సత్యం, మోహన్‌రావు, జాంగిర్, సుల్తాన్‌బిగ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మేడే కవి సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రపంచ కార్మికుల దినోత్సవం, శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం 4 గంటలకు జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనొద్దీన్, యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడే లేదా శ్రీశ్రీ అంశంపై కవులు, కవయిత్రులు తమ కవితలు వినిపించాలని కోరారు.

ఇక సమరమే..

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

తేలిన అభ్యర్థుల సంఖ్య

- నాగర్‌కర్నూల్ నుంచి 19, మహబూబ్‌నగర్ నుంచి 31 మంది బరిలో..
- రెండుచోట్ల ఆరుగురు అభ్యర్థుల ఉపసంహరణ
- స్వతంత్రులకు గుర్తులు కేటాయించిన అధికారులు
- రెండుస్థానాల్లోనూ త్రిముఖ పోటీ
- ఇక ప్రచారంపైనే ప్రధాన పార్టీల దృష్టి



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం



నామినేషన్ వేసిన అభ్యర్థులు	42
నామినేషన్ల తిరస్కరణ	7
ఉపసంహరించుకున్న అభ్యర్థులు	4
పోటీలో ఉన్నవారు	31


నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం



నామినేషన్ వేసిన అభ్యర్థులు	34
నామినేషన్ల తిరస్కరణ	13
ఉపసంహరించుకున్న అభ్యర్థులు	2
పోటీలో ఉన్నవారు	19

● మహబూబ్‌నగర్


మన్నె శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్‌ఎస్)


చల్లా వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్)


డీకే అరుణ (బీజేపీ)

● నాగర్‌కర్నూల్


ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (బీఆర్‌ఎస్)


మల్లు రవి (కాంగ్రెస్)


భరత్‌ప్రసాద్ (బీజేపీ)

సాక్షి, నాగర్‌కర్నూల్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పర్వం ముగిసింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగా.. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో 50 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 31 మంది, నాగర్‌కర్నూల్ స్థానానికి 19 మంది ఎన్నికల బరిలో తలపడనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి మొత్తం 42 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 7 నామినేషన్లు స్క్రూట్నీలో తిరస్కరణకు గురయ్యాయి. సోమవారం నలుగురు స్వతంత్రు అభ్యర్థులు మహ్మద్ ఇంతియాజ్, మహ్మద్ అబ్దుల్ రహీం, శ్రీకాంత్ పిల్లెల, కె.జంగయ్య తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 31 మంది అభ్యర్థులు మహబూబ్‌నగర్ స్థానంలో పోటీపడుతున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇక్కడ జాతీయ, ప్రాంతీయ పార్టీల నుంచి 11 మంది పోటీ చేస్తుండగా.. 20 మంది స్వతంత్రులు పోటీలో నిలిచారు.

➪ నాగర్‌కర్నూల్ స్థానంలో మొత్తం 34 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 13 మంది నామినేషన్లను పరిశీలన సందర్భంగా అధికారులు తిరస్కరించారు. సోమవారం ఉపసంహరణకు చివరి రోజు కాగా.. ఆర్‌సీపీఐ పార్టీకి చెందిన నక్క పాపయ్య, మరో స్వతంత్ర అభ్యర్థి నేడిగొండ కృష్ణయ్య తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో నాగర్‌కర్నూల్ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక్కడ జాతీయ, ప్రాంతీయ పార్టీల నుంచి 11 మంది పోటీ చేస్తుండగా.. 8 మంది స్వతంత్రులు పోటీలో నిలిచారు.

16 దాటితే అదనపు బ్యాలెట్..

నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం పూర్తికావడంతో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య తేలిపోయింది. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గుర్తులు కేటాయించారు. ఈవీఎంలో 15 మంది అభ్యర్థులతోపాటు నోటా ఉంటుంది. నోటాతో కలిపి మొత్తం అభ్యర్థుల సంఖ్య 16 కాగా.. 16 దాటితే రెండో బ్యాలెట్ యూనిట్ అవసరం కానుంది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల సంఖ్య 16 దాటడంతో ప్రతి పోలింగ్ బూత్‌లో అవసరమైన రెండో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు కోసం అధికారులు సిద్ధమవుతున్నారు.

హోరెత్తనున్న ప్రచారం..

నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరెత్తనుంది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు, మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీలపై పార్టీలు ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. ఎంపీ అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సైతం ప్రచారంలో జోరు పెంచారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు ప్రధానంగా సామాజిక వర్గాలపై దృష్టిసారించి వారి ఓట్లను గంపగుత్తగా పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం వారితో ప్రత్యేకంగా సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 13న లోక్‌సభ ఎన్నికలు ఉండగా.. ఒకరోజు ముందుగానే పార్టీల ఎన్నికల ప్రచారానికి ముగింపు పలకాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను ఆకర్షించేందుకు పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ బరిలో ఉన్న అభ్యర్థులు..

డీకే అరుణ (బీజేపీ), మన్నె శ్రీనివాస్‌రెడ్డి(బీఆర్‌ఎస్), వంశీచంద్‌రెడ్డి(కాంగ్రెస్), మహ్మద్ అల్లావుద్దీన్(బీఎస్పీ), ఆంజనేయులు.ఎం జై స్వరాజ్ పార్టీ), జి.రాకేశ్ (ధర్మ సమాజ్ పార్టీ), తల్లాడ వెంకటేశ్వర్లు(అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), కె.శంకర్‌రెడ్డి (విడుతలై చిరుతైగల్ కచ్చి), బి.రవీందర్ (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా), నరేశ్‌రెడ్డి (తెలంగాణ జాగీర్ పార్టీ), అనీసుర్ రహమాన్ (బహుజన్ ముక్తి పార్టీ), స్వతంత్రులు కారుకొండ శ్రీనివాసులు, ముంగి నవీన్‌రెడ్డి, అదరి అంజయ్య, మల్లెల హరీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, కె.ఉదయ్‌తేజ్ నాయక్, సభావట్ విజయ, గంబావత్ దినేష్, హనుమేశ్, ముడావత్ బాలరాజు నాయక్, నడిమింటి శ్రీనివాసులు, పి.సందీప్‌కుమార్‌రెడ్డి, బండ సత్యనారాయణ, గోవిందమ్మ, సంగపాగ సరోజనమ్మ, కె.యాదగిరి, టి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఉమాశంకర్, కె.వెంకటయ్య ఉన్నారు.

తెలంగాణలో అధిక ఎంపీ సీట్లు గెలుస్తాం


ఎమ్మెల్యేలు, కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహిస్తున్న దీపాదాస్ మున్షీ

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీపై, రాహుల్ గాంధీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని, ప్రధాని స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపదాస్ మున్షీ అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఆమె పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డితోపాటు పార్టీ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లతో ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సరళిపై సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథ్, సంపత్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, స్థానిక సంస్థల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో మేం శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం, ఆయన ఇక్కడ ఎమ్మెల్యేగా ఉండటంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామన్నారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటును కాంగ్రెస్ గెలుస్తుందని, ప్రజలు కూడా వంశీచంద్‌రెడ్డిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నట్లు అర్థమవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసు ఇవ్వడంపై విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ నోటీసులపై న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు.

నవకల్పనలతో మత్స్య పరిశ్రమకు ఊతం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నవకల్పనల ఆవిష్కరణతో మత్స్య పరిశ్రమకు మరింత ఊతం లభిస్తుందని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం ఆధ్వర్యంలో 'భారతదేశ స్థిరమైన అభివృద్ధి కోసం మత్స్య సాగు ప్రాసెసింగ్–ఆవిష్కరణలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన ఒక రోజు జాతీయ సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో కోట్లాది మంది ప్రజలు మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, తీర ప్రాంత చేపల పెంపకం, నూతన పద్ధతులు పాటించడం వల్ల ఎంతో మందికి జీవనోపాధి మెరుగుపడిందన్నారు. మరోవైపు చేపలు తినడం వల్ల మనిషి మంచి ప్రొటీన్లు లభిస్తాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాధారోహిణి మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది మత్స్య రంగానికే అన్నారు. చేపల పెంపకంపై యువత అవగాహన పెంచుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, రీసోర్సుపర్సన్ ముత్తపకవి, భానుప్రకాష్, అధ్యాపకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, గంగాధర్, అమీనా ముంతాజ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: బ్రాహ్మణ సేవా సమితి, పరశురామ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల మైదానంలో చేసిన ఏర్పాట్లను ఆయా సంఘాల ప్రతినిధులు సోమ వారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ కల్యాణంలో మంగళవారం వేదపఠనం, సహస్ర దీపాలంకరణ, ఎదుర్కోళ్లు, ప్రముఖ గాయకులు గద్వాల చంద్రశేఖరరావుచే అన్నమాచార్య సంకీర్తన కచేరీ, చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లూరు భీమాచార్యులు, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్రశర్మ, పరశురామ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు జోషి సంతోషాచార్యులు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ ఆచార్య, తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, శ్రవణ్, ఇరువింటి శ్రవణ్‌కుమార్ శర్మ, సుమన్ శర్మ, గంగాపురం పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారుల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే మా ప్రధాన ధ్యేయమని మహబూబ్‌నగర్ పీఎఫ్ ఎన్‌ఫోర్‌మెంట్ అధికారి ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో నిర్వహించిన నిధి ఆప్కె నిక్కట్ 2–0 కార్యక్రమంలో ఆయన పీఎఫ్ సభ్యుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి నెల పీఎఫ్ పెన్షన్ దారుల చెల్లింపులు సమస్యలు, ఆన్‌లైన్ క్లైయిమ్ ఫైల్ చేయడం, ఈకేవైసీ రిలేటెడ్ లింక్స్ సభ్యులు తమ ఖాతాలో నిల్వలు, ఈడీఎల్‌ఐ ఇన్సూరెన్స్ సభ్యత్వం వలన పొందే ప్రయోజనాలను వివరించినట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ


మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో వ్యయ పరిశీలకులు వరుణ్ రంగస్వామి, పోలీస్ పరిశీలకులు కలురాం రావత్, రిటర్నింగ్ అధికారి రవినాయక్, 7 అసెంబ్లీ నియోజకవర్గ ఏఆర్‌ఓలు, పోలీస్ అధికారులతో కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది నిబంధనలు, మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు. ఎన్నికలు ఒక పండగ అని, పోలింగ్ మే 13న ప్రతి ఓటరూ తమ హక్కు వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎలాంటి అనైతిక ధోరణులు అవలంబించొద్దని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు తాగునీరు, టాయిలెట్లు పరిశీలించాలన్నారు. వ్యయ పరిశీలకులు వరుణ్ రంగస్వామి మాట్లాడుతూ డబ్బు, వస్తువులు, మద్యం పంపిణీ ఉంటే సీ విజిల్ యాప్ ద్వారా పౌరులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీస్ పరిశీలకులు శ్రీ కలు రాంరావత్ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రిటర్నింగ్ అధికారి రవినాయక్ మాట్లాడుతూ సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు తర్వాత 31 మంది అభ్యర్థులు బరిలో నిలిచారన్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రించి మే 3 నుంచి టీంల ద్వారా హోం ఓటింగ్ పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. పోలింగ్‌కు 5 రోజుల ముందు వరకు ఓటర్లు అందరికీ పంపిణీ చేస్తామన్నారు. పేట కలెక్టర్ కోయ శ్రీహర్ష తమ పరిధిలో తీసుకున్న ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, పేట, మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, శివేంద్రప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి


శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఐజీ సుధీర్‌బాబు, డీఐజీ చౌహాన్

అడ్డాకుల/ బాలానగర్: మూసాపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఐజీ సుధీర్‌బాబు డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, కేసుల నమోదు గురించి ఆరా తీశారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై జిల్లా పోలీసులతో ఐజీ సుధీర్‌బాబు సమీక్ష చేశారు. పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూడాలని చెప్పారు. ఎన్నికల ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. అనంతరం అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించారు. టోల్‌గేట్ వద్ద పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీని పరిశీలించి జిల్లా అధికారులతో మాట్లాడారు. మద్యం, నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే బాలానగర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఐజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వెంట శిక్షణ ఐపీఎస్ చిత్తరంజన్‌దాస్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రామకృష్ణ, నాగార్జున గౌడ్, మూసాపేట, అడ్డాకుల, బాలానగర్ ఎస్ఐలు సుజాత, శ్రీనివాస్, తిరుపాజీ తదితరులున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ

గండీడ్: గ్రామీణ ప్రాంతాలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని సందర్శించి.. రికార్డులు పరిశీలించారు. ఓపీ, కాన్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో వసతులు, రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యాధికారి చంద్రశేఖర్‌తో ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులకే వస్తున్నారని, దానికి తగ్గట్టుగా సేవలు అందించాలని, గ్రామాల నుంచి ఎక్కువ శాతం మంది కాన్పుల కోసం వచ్చేలా చూడాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎండాకాలం కావడంతో అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన వారికి ఓఆర్‌ఎస్ పాకెట్లు సరఫరా చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, తాగునీటి వసతి కల్పించాలన్నారు. సబ్ సెంటర్లలో ప్రతి బుధవారం గర్భిణులకు ఇవ్వాల్సిన మందులు, ఇంజెక్షన్లు సకాలంలో అందించాలని చెప్పారు. వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా కొనసాగాలని, గ్రామాల్లో రోగాల వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సూపర్‌వైజర్ సుభాష్ చంద్రబోస్, హెల్త్ ఎడ్యుకేటర్ నాగశెట్టి, సీహెచ్‌ఓ రాములు, సూపర్‌వైజర్లు శాంతమ్మ, అంబదాస్ తదితరులున్నారు.

మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించాలి


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఐఎం ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో రైతులు, కూలీలు, కార్మికులు, పేదలు, మధ్య తరగతి ప్రజలు అనేక కష్టాలు పడ్డారన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను రక్షించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, 50 శాతం అధిక ధరకు అమ్ముకునే వెసులుబాటు ఇవ్వాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉచిత ఆరోగ్య రక్షణ కల్పించాలని, ప్రైవేట్ ఆరోగ్య బీమా పథకాలు రద్దు చేయాలని, ప్రజారోగ్యానికి కేంద్ర బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే పార్లమెంట్, అసెంబ్లీలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్ కల్పించాలని, 2020 నూతన విద్యా విధానం రద్దు చేయాలని, వృద్ధులకు నెలకు కనీస పింఛన్ రూ.6 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించకూడదని, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల్లో విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ధనికులకు కార్పొరేట్లపై పన్నులు పెంచాలని, అత్యంత ధనికులపై సంపద పన్ను అమలుపరచాలని, వారసత్వ సంపదపై పన్ను వేయాలని తమ మేనిఫెస్టోలో పొందుపరిచామని, ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కోసం, రాజ్యాంగ రక్షణ కోసం, ప్రజాస్వామ్యం స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాల కోసం తమ పార్టీ పోరాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, చంద్రకాంత్, నాయకులు మోహన్, రాజ్‌కుమార్, ప్రశాంత్, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛపై సంఘ్ దాడి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సమూహ ఆధ్వర్యంలో జరుగుతున్న లౌకికవాదం సాహిత్యంపై సంఘ్ పరివార్ శక్తులు జరిపిన దాడి భావ ప్రకటన స్వేచ్ఛపై జరిపినట్లు అయిందని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు అభిప్రాయపడ్డారు. సెక్యులర్ రైటర్స్ ఫోరం సమూహపై సంఘ్ పరివార్ జరిపిన దాడిని ఖండిస్తూ సోమవారం తెలంగాణ చౌరస్తాలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు విజయ్, పాలమూరు అధ్యయన వేదిక నాయకుడు తిమ్మప్ప, డీటీఎఫ్ నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు భావ ప్రకటన స్వేచ్ఛలో భాగంగా భిన్న అభిప్రాయాలు సమ్మేళనం విభిన్న శాస్త్రీయ ఆలోచనలు ఉన్న దేశం అన్నారు. లౌకిక వాదం, ప్రజాస్వామ్యాన్ని కనుమరుగు చేయాలనుకునే బీజేపీ శక్తుల ఈ ఆలోచనలు ప్రజల పోరాటాలు సెక్యులరిజానికి అడ్డంకిగా మారాయన్నారు. దేశంలో ప్రజల భావజాలంను కలుషితం చేస్తూ దేశ సంపను కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకే వివిధ రూపాల్లో ఈ దాడులు చేస్తుందన్నారు. దాడి చేసిన వారిని వెంటనే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆదిత్య, చిన్న, బిచ్చారెడ్డి, గోపాల్, చైతన్య, శ్రీదేవి, శిరీష, అలివేలు, గోవిందు, ఘట్టన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్నేహితుడి వివాహానికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

ఉండవెల్లి: స్నేహితుడి వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన సున్నిఖాసీం వలి (19), అమీర్‌షేక్ ఆదివారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో స్నేహితుడి వివాహానికి బైక్ వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున ఇద్దరు సొంత గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో అలంపూర్‌చౌరస్తా వద్దకు రాగానే నిద్రమత్తు కారణంగా బైక్ అదుపు తప్పి ఇద్దరు కిందపడిపోయారు. సున్ని ఖాసీం వలీ అక్కడికక్కడే మృతి చెందగా, అమీర్‌ను కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సున్ని మహ్మద్ వలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

అర్ధరాత్రి బాలుడు అదృశ్యం

- గ్రామ శివారులో వదిలివెళ్లిన వైనం



మహబూబ్‌నగర్ క్రైం: తల్లిదండ్రులతో పాటు ఇంటి బయట నిద్రపోతున్న బాలుడు అదృశ్యం కలకలం రేపగా, గ్రామ శివారులో ఆచూకీ లభ్యమైంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొక్కలోనిపల్లికి చెందిన మంజుల, శంకర్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులు అందరూ ఇంటి బయట నిద్రపోయారు. మధ్యరాత్రి ఒంటి గంట సమయంలో తల్లి మంజుల నిద్రలేచి చూస్తే పక్కనే ఉన్న మూడేళ్ల కుమారుడు వంశీ కనిపించ లేదు. రాత్రి గ్రామంలో అంతా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు జాగిలాల సాయంతో గ్రామంలో గాలించారు. సీఐ గాంధీ నాయక్‌తో పాటు ఎస్ఐ ఇతర బలగాలు సమీపంలో ఉన్న గుట్టను పూర్తిగా వెతికారు. అయితే సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులో వదిలేసి వెళ్లారు. తల్లి ఫిర్యాదు మేరకు అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కోడలిని హతమార్చిన అత్త, ఆడపడుచు

లింగాల: నిద్రపోతున్న కోడలిని అత్త, ఆడపడుచూ గొంతు నులిమి చంపిన ఘటన సోమవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని అంబట్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూర్ మండలం నర్సాయపల్లికి చెందిన వడ్త్య విజయ (32)కు వడ్త్య చంద్రుతో 19ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా తరుచూ వీరి కుటుంబంలో కలహాలు ఉండేవి. భర్త ఎప్పుడూ మద్యం మత్తులో ఉండేవాడని స్థానికులు తెలిపారు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి భర్త మద్యం సేవించి ఇంటిలోనే గాఢ నిద్రలో ఉండగా, పథకం ప్రకారం అత్త వడ్త్య లక్ష్మి, ఆడపడుచు బొజ్జి వడ్త్య విజయ గొంతు నులిమి చంపేశారు. హత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. సమాచారం అందుకున్న అచ్చంపేట సీఐ రవీందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారి తీసిన కారణాలను తెలుసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది.

పశుగ్రాసం దగ్ధం



వెల్దండ: మండలంలోని కంటోనిపల్లిలో సోమవారం మధ్యాహ్నం ఎల్‌టీ విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తాకడంతో మంటలు చెలరేగి పశుగ్రాసం, పైపులు, బోరుమోటార్లు కాలిపోయాయి. రైతు సురేందర్ వ్యవసాయ పొలంలో ఎల్‌టీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులు వేలాడుతున్నాయి. అనేక సార్లు విద్యుత్ అధికారుల దృష్టికి రైతులు తీసుకెళ్లినా సమస్య పరిష్కరించలేదు. సోమవారం మధ్యాహ్నం గాలులు రావడంతో వైర్లు ఒకదానికి ఒకటి తాకి మంటలు వచ్చాయి. దీంతో దాదాపుగా 10 ఎకరాల పొలంలో మంటలు వ్యాపించి పశుగ్రాసం, ఎండుగడ్డి దగ్ధమైంది. రైతులు నీటితో మంటలను అదుపు చేశారు. ఈ మంటల్లో సురేందర్ చెందిన వ్యవసాయ బోరుమోటర్, వైరు కాలిపోయింది. అదేవిధంగా తోట సుదర్శన్ అర ఎకరం వరిగడ్డ దగ్ధమైంది. వెంకటేష్, రాఘవేందర్‌రెడ్డిలకు చెందిన 50కేజీల నీటిపైపులు కాలిపోయాయి.

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న
బీజేపీని ఓడిద్దాం

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వనపర్తిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి: ప్రజా సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసి, కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న బీజేపీని ఓడిద్దామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశానికి మంత్రి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి కావాలంటే, ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ మతోన్మాద చర్యలపై, ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా కార్పొరేటర్లకు దోచిపెడుతున్న వారికి ప్రస్తుత ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధిని వదిలేసి అక్షింతలపై దృష్టి పెడతారా?

అభివృద్ధినిని గాలికి వదిలేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అక్షింతలపై దృష్టిపెట్టి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. ఓట్ల కోసం హిందుత్వాన్ని, దేవుళ్లను వాడుకుంటున్న వారిని ప్రజలను విశ్వసించబోరన్నారు.

కార్పొరేట్ శక్తులు అభివృద్ధి చెందాయి

దేశంలో పదేళ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్ శక్తులు మాత్రమే అభివృద్ధి చెందాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. ఇండియా కూటమి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలోని మొత్తం కార్మికవర్గాన్ని కార్పొరేట్లకు కట్టు బానిసలుగా చేయడానికి కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ల అనుకూల లేబర్ కోడ్‌లను మనుగడలోకి తీసుకువచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణ, జిల్లా కార్యదర్శి జబ్బర్, పర్వతాలు, వెంకట్ స్వామి, కిల్లె గోపాల్, లక్ష్మి, గీత, పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, గోపి, మేకల ఆంజనేయులు, రాజు, ఆర్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

కొల్లాపూర్ సమస్యలను పరిష్కరిస్తాం

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్, చెన్నపురావుపల్లి, నారాయణపల్లి, గంట్రావ్‌పల్లి, జొన్నలబొగుడలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. చెన్నపురావుపల్లిలో ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ గౌరమ్మ, శ్రీనివాస్‌లు, నర్సింహ, బద్దెనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే ప్రజాగొంతుకనవుతా..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గద్వాలరూరల్/కేటీదొడ్డి/గట్టు/మల్దకల్/ధరూరు: తనను గెలిపిస్తే ప్రజాసమస్యలపై గళమెత్తి ప్రజాగొంతుకనవుతానని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన గద్వాల పట్టణంలో ఇండోర్‌స్టేడియంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం, దౌలత్‌హోటల్ వద్ద జనాలతో మాటమంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా కేటీదొడ్డి, గట్టు, మల్దకల్ మండలాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కరెంట్ కోతలు, రైతు రుణమాఫీ, రైతుబంధు వంటి పథకాలను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. పదేళ్ల నిజానికి, వందరోజుల అబద్ధాలకు జరుగుతున్న ఎన్నికలంటూ వర్ణించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు దిక్కులేదని, ఇప్పుడు కొత్తగా మళ్లీ ఐదు గ్యారంటీల పేరిట మరోసారి మోసం చేయాలని చూస్తున్నట్లు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న మోసపూరిత హామీలకు మోసపోకుండా కారుగుర్తుకు ఓటేయాలన్నారు. కొట్లాడిసాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలు రాష్ట్రం వైపు చూసేలా చేసిన నాయకుడు కేసీఆర్ అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించాలి

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సుభాన్, జంబు రామన్‌గౌడ్, గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌నాయుడు, ఉరుకుంది, హనుమంతు తదితరులు ఉన్నారు.

గట్టు అభివృద్ధికి ప్రత్యేక నిధులు

గట్టు ప్రాంత అభివృద్ధికి ఢిల్లీ నుంచి ప్రత్యేక నిధులను తీసుకురావడానికి ప్రయత్నిస్తానని, తనను ఎంపీగా గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గట్టులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పోలీస్ ఉద్యోగాన్ని వదులుకుని, రాజకీయాల్లోకి సేవ చేయడానికి వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కరువు అని, కాంగ్రెస్‌తోనే కరువు వచ్చినట్లు ఆరోపించారు. ఎంపీపీ విజయ్ కుమార్, రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

■ బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, వంద రోజుల కాంగ్రెస్ పాలనకు మధ్య జరిగే పోరాటమే ఈ పార్లమెంట్ ఎన్నికలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. రాత్రి 9 గంటలకు ధరూర్ మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి ప్రచార సభలో మాట్లాడారు.

కాంగ్రెస్‌ను నమ్మొద్దు

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మల్దకల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సత్యారెడ్డి, తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, నరేందర్, వెంకటన్న, రమేష్‌రెడ్డి, సత్యారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ పాపం కేంద్ర ప్రభుత్వానిదే



కోయిల్‌కొండలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మరికల్: నాలుగు గ్రామాల మధ్యన ఇథనాల్ కంపెనీ ఏర్పాటు కావడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండలంలో సోమవారం చిత్తనూర్, జిన్నారం, ఎక్లాస్‌పూర్, కన్మనూర్‌లో ప్రచారం నిర్వహించారు. కన్మనూర్‌లో మహదేవ్ అనే వ్యక్తి ఇథనాల్ కంపెనీ రద్దు విషయంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థి ఎదుట ప్రస్తావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీలకు అనుమతులు ఇచ్చింది కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమని వారిని నిలదీయాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ విషయంపై గ్రామంలోకి బీజేపీ నాయకులు వచ్చినప్పుడు అడగాలని వారికి సూచించారు. ఆగస్టు 15లోపు రూ. 2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని, ప్రతి ఒక్క రు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ

కోయిల్‌కొండ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, అన్ని రంగాల అభివృద్ధి తమ ప్రభుత్వంతోనే సాధ్యమని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో, వింజామూర్‌లో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెంపర్ణికారెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డిలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలమూరు పార్లమెంట్ స్థానం భారీ మెజార్టీతో గెలుపొందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సుసౌకర్యం ద్వారా మహిళలు లబ్ధిపొందుతున్నారన్నారు. 200 యూనిట్ల విద్యుత్ వాడేవారు బిల్లును చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఒకే మారు రూ.2లక్షల రుణమాఫీ చేయడానికి పూర్తిస్థాయి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోయిల్‌కొండ మండలంలోని ప్రతి గ్రామంలోని చెరువును కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా నింపుతామన్నారు.

ఓటమి భయంతోనే కుల రాజకీయాలు



నాగినోనిపల్లిలో మాట్లాడుతున్న డీకే అరుణ

- దమ్ముంటే ఎన్నికల హామీలను అమలుచేయాలి
- మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

పాలమూరు/హన్వాడ: ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ కుల రాజకీయాలు చేస్తోందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం, హన్వాడ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్‌కు దమ్ముంటే ఇచ్చిన హామీలను అమలుచేయాలని అన్నారు. ఫ్రీ బస్ పేరుతో హడావుడి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల మధ్య నిత్యం గొడవలు సృష్టిస్తుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే మహిళలకు స్పెషల్ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసంచేసిన రేవంత్‌రెడ్డి ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రశ్నించారు.

■ మాజీ సీఎం ఎన్నికల వ్యవస్థను సర్వనాశనం చేశాడని.. ప్రతి ఎన్నికకు పైసలిచ్చుడు ఆ మహానుభావుడు చేసిన అలవాటేనని.. పార్టీ మీటింగ్ మొదలు.. సర్పంచ్ మీటింగ్ వరకు రూ.లక్షల కోట్లు పంచుడు అలవాటు చేసి వ్యవస్థను భ్రష్టుపట్టించాడని మాజీ సీఎం కేసీఆర్‌పై డీకే అరుణ ధ్వజమెత్తారు. పోయినోడు అప్పులు చేసి పోతే.. ఇప్పుడొచ్చినోడు వాటిని పూడ్చేందుకు మరిన్ని అప్పులు చేస్తున్నాడని ఆరోపించారు. కల్వకుర్తి నుంచి వచ్చి ఇక్కడి ఆడబిడ్డను అణచివేయాలని చూస్తున్నారు.. ఆనాడు జైపాల్‌రెడ్డి.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి వరకు అందరూ అరుణమ్మకు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. సన్నాసుల్లారా దమ్ముంటే రాజకీయంగా పోటీ పడండి.. ఈ జిల్లా కోసం మీరేం చేశారో చెప్పండని డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, కొండ బుచ్చిరెడ్డి, పద్మయ్య, తిరుపతయ్య, రఘురాంగౌడ్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి



గోపాల్‌పేటలో భోజనం చేస్తున్న ఎంపీ అభ్యర్థి మల్లురవి

గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ సీటు కాంగ్రెస్ పార్టీనే గెలవబోతుందని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. సోమవారం ఆయన రేవల్లి మండలంలో ప్రచారం నిర్వహించిన అనంతరం గోపాల్‌పేట మండల కేంద్రంలోని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్ ఇంటికి వెళ్లి భోజనం చేశారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడి స్థానికంగా ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, సుధాకర్‌రావు, దేవరాజు, నాగేషి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల బతుకులు బాగు

బల్మూర్: పేద, బలహీన వర్గాల బతుకులు బాగుపడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా ఆయన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మత రాజకీయాలను పెంచి పోషిస్తున్న బీజేపీని ఓడించి, కాంగ్రెస్‌కు ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో ప్రధానిగా రాహుల్‌గాంధీ ఎన్నికై తేనే పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు కోలుకోలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు అమలు చేసిందని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే హామీలన్నీ అమలు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాట నిలబెట్టుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, గిరివర్ధన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, తిరుతపయ్య, రాంప్రసాద్‌గౌడ్, రామాస్వామిగౌడ్, సుధాకర్‌గౌడ్, చంద్రమోహన్, శివ, వెంకటయ్య, లాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత



ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టులో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసుల

నారాయణపేట రూరల్: మండలంలోని రెండు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద సోమవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.3.84లక్షల నగదు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. జిలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ నుంచి వస్తున్న రాథోడ్ శంకర్ రూ.2లక్షలు, చౌడప్ప రూ.లక్ష, వెంకటేష్ వద్ద రూ.52వేలు పట్టుకున్నారు. అదేవిధంగా ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద గుర్మిట్కల్ నుంచి ఊట్కూర్ మండలం చిన్నపొర్లకు వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.85,500 పట్టుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో అనంతపురం జిల్లా సిద్దాపూరం చెందిన చింత హనుమంత్‌రెడ్డి వద్ద రూ.52వేల నగదు, మహబూబ్‌నగర్ జిల్లా కొకుంట్ల మండలం ముచ్చింతల్ చెందిన కూరగాయల శివన్న వద్ద రూ.80 వేల నగదును ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసులు సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో సయ్యద్ అక్రమ్ హుస్సేన్ వద్ద రూ.2,35,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు సీఐ స్వామి వెల్లడించారు.

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఊట్కూర్ మండలం మగ్దంపూర్ చెందిన సిద్దయ్య రూ.1.30లక్షల నగదును తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

మద్యం పట్టివేత

మండలంలోని ముచ్చింతల చెందిన సాలే మహేందర్ సోమవారం సాయంత్రం అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కిసాన్‌సెల్ పరిశీలకుడి నియామకం



రమేష్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ పరిశీలకుడిగా బాదేపల్లి వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డిని నియమిస్తూ తెలంగాణ ఇన్‌చార్జి సకీనా పటేల్ సోమవారం నియామకపత్రం విడుదల చేశారు. మూడు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలని నియామకపు పత్రంలో సూచించారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని విభాగాలను, పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని వెల్లడించారు.

పోల్ చీటీలోనే అన్ని వివరాలు



ఓటరుకు అందించే పోల్ చీటీ

నవాబుపేట: పోల్ చీటి చేతిలో ఉంటే చాలు నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లొచ్చు. పోల్ చీటితో పాటు కేంద్రం చిరునామాతో కూడిన మ్యాప్‌ను ఎన్నికల సంఘం ప్రచురించింది. ఈ సందర్భంగా పోలింగ్ తేదీకి ముందుగానే ఈ చీటీలు ఓటరు చేతికి అందించేలా ఎన్నికల సిబ్బంది ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా, నమోదు వివరాలకు సంబంధించిన సమాచారం సైతం పొందు పరిచి, ఓటు వేసేందుకు పాటించాల్సిన నిబంధనలు, గుర్తింపు కార్డుల వివరాలు అందించి ఓటరుకు అనుమానాలు లేకుండా సులభతరం చేసింది ఎన్నికల కమిషన్. గతంలో పార్టీలు తమకు ఇష్టం వచ్చిన రీతిలో చీటీలు ముద్రించి తమ గుర్తులతో పాటు ఓటర్లకు ఇచ్చేవారు. దీంతో చాలా మంది ఏ చీటీ తీసుకుని వెళ్లాలో తెలియక తికమక పడిపోయే రోజులుండేవి. తాజాగా ఎన్నికల సంఘం పోలింగ్‌కు 12 రోజుల ముందే చీటీలను అందిస్తుండటంతో ఓటరుకు మేలు కలుగుతుంది.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

అమరచింత: ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 8:30గంటల సమయంలో అమరచింత నుంచి పెద్దకడ్మూర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తూ దారి ఇవ్వడం లేదని అడ్డంగా బైక్‌ను నిలిపి నాగల్‌కడ్మూర్ చెందిన రెవెన్యూ శాఖ ఉద్యోగి రవికుమార్ డ్రైవర్, కండక్టర్ రాజ్ అహ్మద్‌పై అకారణంగా దాడి చేసినట్లు తెలిపారు. దాడి సమయంలో రవికుమార్ మద్యం మత్తులో ఉన్నాడని చెప్పారు. డీఎంకు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో నగదు, ఆభరణాలు చోరీ



నందారంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం

తాడూరు: మండలంలోని శిర్సవాడలో సోమవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని బద్దలు కొట్టి 5 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం తాము వచ్చి చూసుకునేలోగా తాళం బద్దలు కొట్టి బీరువాలోని సామానంతా చెల్లాచెదురు చేసి చోరీకి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ మహేష్ క్లూస్ టీంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. సీసీ పుటేజీల ఆధారంగా పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు ఇళ్లలో చోరీ

బాలానగర్: మండలంలోని నందారం గ్రామంలో సోమవారం ఉదయం మూడు ఇళ్లలో దొంగలు పడ్డారు. ఎస్ఐ తిరుపాజీ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఓ ఇంట్లో వెళ్లి వేడుకల్లో పాల్గొన్న నందారం తండా వాసులు సోమవారం ఉదయం వరకు డీజేలతో ఆటపాటల మధ్య మునిగి తేలారు. దీంతో సోమవారం ఉదయం 3 గంటల సమయంలో అందరూ వేడుకలు పూర్తి చేసుకుని పడుకున్నారు. దీంతో ఇదే అదునుగా భావించిన ఇద్దరు దొంగలు సభావత్ రవి ఇంట్లో మూడు తులాల బంగారు పుస్తెల తాడు, ధన్‌సింగ్ ఇంట్లో రూ.80 వేల నగదు, మోహన్ ఇంట్లో రూ.16 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ, క్లూస్ టీం, సీఐ రాజేందర్ ప్రసాద్ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సామగ్రి చోరీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సామగ్రి చోరీపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని గదుల వెనుకవైపు ఉన్న వ్యవసాయానికి సంబంధించిన కండక్టర్ వైర్, మేల్, ఫీమేల్ పరికరాలను ఆదివారం రాత్రి చోరీకి గురైనట్లు ఎస్ఐ తెలిపారు. సామగ్రి విలువ దాదాపుగా రూ.లక్ష ఉంటుందన్నారు. చోరీకి గురైన ప్రాంతాన్ని క్లూస్ టీం సందర్శించి పూర్తి వివరాలను సేకరించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.